

కథా కౌముది

రెండవ స్వరం పి.రాజేంద్రప్రసాద్

.

ఆ ఎక్స్ ప్రెస్ ట్రెయిన్ ప్రతీ సిగ్నల్ దగ్గరా ఆగుతూ ఆగుతూ నడుస్తున్నది. ఒరిస్సా నుండి విశాఖపట్నం వస్తున్న ఆ ట్రెయిన్ లోనే లేడీ టీ.టీ.యీగా పనిచేస్తున్నాను. రాత్రంతా ఆ బోగీలో ఏ సీ చాలా ఎక్కువగా ఉన్నది. ఆ బోగీ ఏ సీ మెకానిక్ శలవు పెట్టడంతో వేరే బోగీ మెకానిక్కే ఈ బోగీ కూడా చూసుకోవాల్సి వచ్చింది. అతడికి బొత్తిగా ఖాళీలేక ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఏ సీ తగ్గించడానికి రానేలేదు. రాత్రంతా కోటు లోపల్నించి కూడా చలి దూరి చాలా ఇబ్బంది పెట్టింది. దానికి తోడు ప్రయాణీకులకు వచ్చే వింత వింత సమస్యలను తీర్చడానికి బుర్ర బద్దలు కొట్టుకోవాల్సి వచ్చింది. నైట్ డ్యూటీ కొంత నయమనీ రాత్రి పదిగంటలకల్లా అందరూ పడుకుండి పోతారులే అన్న నా ఉద్దేశ్యాన్ని పటాపంచలు చేస్తూ రాత్రి రెండు దాకా ప్రతీ స్టేషన్ లోనూ ప్రయాణీకులు జాయిన్ అవ్వుతూనే ఉన్నారు. ప్రతివాడిదీ లోయర్ బెర్తు...దానిలో ఎవడో వేరేవాడు పడుకొని ఉండడం, వాడిని నేను వాడి బెర్తుకు పంపి గొడవను సెటిల్ చేయడం... ఓహ్! తల వాచిపోయింది. టైమ్ అప్పటికే ఉదయం ఏడు అయిపోతున్నది. ఆరుగంటలకే విశాఖపట్నం చేరవలసిన ఆ ట్రైను అప్పటికే ఒక గంట లేటుగా నడుస్తోంది. "పాడు బండి.. ఎప్పుడూ లేటే!" చిరాకు పడుతూ తిట్టుకున్నాను.

టీ.టీ.యీ.కి ప్రత్యేకించిన డోర్ దగ్గర ఉన్న బర్తులో కూర్చుని నా వస్తువులు అన్నీ సర్దేసుకున్నాను. మరి పావుగంటకో, అరగంటకో ట్రెయిను విశాఖ చేరుతుంది. విశాఖ వస్తే నా డ్యూటీ పూర్తయిపోతుంది. నిన్నటి రోజు రాఖీ పండగ. సంబల్పూర్ ట్రిప్పు నాకు కలిసొచ్చింది. ఆ ఊళ్ళోనే సివిల్ ఇంజనీర్ గా పనిచేస్తున్న మా అన్నయ్య వాళ్ళింటికి వెళ్లి రాఖీ కట్టేసి వచ్చాను. మామూలుగా మా అన్నయ్యను మా ఇంటికి పిలుస్తాను. ఈ సారి నేనే వెళ్ళడంతో అన్నయ్య చాలా సంతోషించాడు. నన్ను ఆశీర్వదించి, వదిన చేత చీర పెట్టించి చేతికి పదివేలిచ్చాడు. పదివేలంటే పెద్ద మొత్తమే. త్వరగా ఇంటికి వెళ్లి ఆయన గారికి చెప్పాలి. చాలా సంతోషపడతారు. కానీ తొమ్మిదింటికల్లా మా వారు తాను లెక్చరర్ గా పని చేసే యూనివర్సిటీకి బయలుదేరిపోతారు. అంతలోపల ఇంటికి చేరాలి. అందుకే నాక్కొంచెం ఖంగారుగా ఉంది.

అయినా చెయ్యగలిగింది లేదు. ట్రైను ఎప్పుడు చేరితే అప్పుడు దిగి, డ్యూటీ అయిపోయినట్టు సంతకం చేసిగాని ఇంటికి వెళ్ళడానికి లేదు. భారంగా నిట్టూర్చాను.

ఉన్నట్టుండి డోర్ దగ్గర కలకలం వినవచ్చింది. ఎవరో ఒకాయన హిందీలో అరుస్తున్నాడు. "ఉస్ మే క్యా ఛుపా రక్ఖీ హై! బాహర్ నికాల్. కిధర్ సే కీ చోరీ?" అంటూ.

చోరీ అన్న మాట వినగానే గబుక్కున సీట్ లోంచి లేచాను. డోర్ పక్కన ఉన్న డస్ట్ బిన్, సింక్ ల పక్కన ఒక యువతి కూర్చుని ఉన్నది. చూడగానే ముష్టిదని తెలుస్తున్నది. చిరిగి పాతలైన చీరె, వొళ్ళో నెలల పిల్లాడో పిల్లో పాలు తాగుతున్నది. కాళ్ళ దగ్గర రెండు మూడేళ్ళ వయసున్న ఇంకో పిల్లాడు నిద్రలో ఉన్నాడు. నేను వెళ్లి చూసేటప్పటికి ఆమె ఎడమ చేతిని పిల్లాడి తలకింద పెట్టి పాలిస్తున్నది. కుడి చేతిలో ఏదో దాచి తన వీపు వెనుకకు దాచడానికి ప్రయత్నం చేస్తున్నది.

"క్యా హై గడ్ బడ్?" ప్రయాణీకుణ్ణి అడిగాను. అతను హిందీలో చెప్పాడు. తను బ్రష్ చేసుకోవడానికి సింక్ దగ్గరికి రాగానే ఆమె గాభరా పడి చేతిలోని పొట్లమేదో వెనక్కి దాచిందంట. ఇతను అడిగితే ఆమె గాభరా పడుతున్నది గాని సమాధానం మాత్రం చెప్పకుండా ఆ పొట్లాన్ని మరింత లోపలికి తోస్తున్నదంట. సాలోచనగా విన్నాను. తొందర పడకూడదు. ముష్టిది అని తెలుస్తూనే ఉంది. ఇద్దరు చంటి పిల్లల్నేసుకుని బెర్తుల మధ్యలోకి వచ్చి ఏదైనా దొంగతనం చెయ్యడం దాదాపు అసాధ్యం.

నేను ఆలోచించేలోపు ఇంకో యువకుడు ఒడియా భాషలో అందుకుని ఆమెను అదే విధంగా బెదిరించసాగాడు. అతన్ని నిశితంగా చూశాను. బెదిరించే వంకతో అతడు ఆమె మీద మీదకు వంగుతున్నాడు. పసిపాపకు పాలిస్తున్న ఆమె వక్షస్థలం వంక ఆశగా ఆబగా చూస్తున్నాడు. ఆమె వంటి మీద చిరిగిన చీరె, ఆపైన వక్ష స్థలం కప్పడానికి మరో జాకెట్టులాంటి చిరుగుల గుడ్డ..ఇవేవీ ఆమె శరీరాన్ని మగ పశువుల చూపుల తూపులనుండి కాపాడలేకపోతున్నాయి. ఒక చెయ్యి పిల్లాడి తల కింద ఉంది. రెండో చెయ్యి వెనక్కి పెట్టుకొని ఏదో దాస్తోంది. ఈ హడావుడిలో ఆమె పైట సగం జారేపోయింది. ఆ తల్లికి అదేమీ పట్టినట్టు లేదు. ఒకచేత్తో చంటిపిల్లను బాలన్స్ చేస్తూ ఇంకో చేత్తో దేనినో దాచుకుంటున్నది. అప్రయత్నంగా నా కోటును గుండెల మీదకి లాక్కున్నాను.

అతని వాలకం గమనించినా ఏమీ చేయలేని పరిస్థితి. నేను అతడిని ఏమైనా అంటే విషయం డైవర్ట్ అయ్యి గొడవ ఇంకాస్త పెద్దదౌతుంది. ఆమెను ఇంకాస్త నెమ్మదిగా లాలించే ధోరణిలో హిందీలోనూ, ఒరియా భాషలోనూ అదేమిటి... ఇచ్చెయ్యమని..అడిగాను. ఆమె నాకు సమాధానం చెప్పకుండా దీనంగా చూస్తూ తన కుడి చేతిని మరింత వెనక్కి పెట్టుకుంటోంది. ఆ చేయి వెనుకనుంచి ఆ సిల్వర్ పాయిల్ పొట్లంలోపలి ఎర్రని కాగితం నన్నాకర్షించింది. లోపల వెండి వస్తువేదన్నా ఉన్నదేమోనన్న అనుమానం బలపడింది. నిజంగానే ఈమె ఏదో దొంగతనమే చేసినట్టుంది.
"ఏయ్! క్యా హై వో! బాహర్ నికాల్!" గట్టిగా అరిచాను. ఆమె బెదిరిపోయింది.

"అమ్మా! ఏమీ లేదమ్మా! ఒగ్గేయండమ్మా!" చేయి బయటకు తీయకుండా అలాగే ఉంచి తన తలను నా కాళ్ళ మీద పెట్టబోయింది. ఓహో! ఇది తెలుగుదన్న మాట! అందుకే హిందీలోనూ, ఒరియాలోనూ అడిగితే జవాబు చెప్పలేదు...అనుకున్నాను. ఆమె తల నా కాళ్ళకు తగలకుండా గబుక్కున వెనక్కు జరిగాను. ఆమె పైట కాస్తా పూర్తిగా జారిపోయింది. ఒరియా భాషలో మాట్లాడిన కుర్రాడే కాక, ముందుగా హిందీలో మాట్లాడిన పెద్దమనిషి కూడా ఒళ్ళంతా కళ్ళు చేసుకొని, దొంగతనం విషయం పూర్తిగా మరచిపోయి ఆకలిగా మిఠాయి పొట్లం వంక చూసినట్టు ఆమె మీద కళ్ళు తిప్పకుండా చూస్తున్నారు. కిందకు వంగి ఆమె పైట సరి చేద్దామంటే, "ఆమె ముష్టిది, పైగా దొంగేమో కూడానూ. నేను టీ. టీ.యి.నై ఉండి.. ఛ.. ఛ.. అలా ఎలా చేస్తాను!" నా నిస్సహాయత కోపంగా మారింది. బలవంతుడి బలహీనత బలహీనుడి మీద కోపంగానూ, అధికారంగానూ మారుతుంది. ఇది తరతరాలుగా నిరూపించబడిన సత్యం. అందుకు నేనూ అతీతం కాదు. నా కోపం మరి కాస్త హెచ్చింది. స్వర స్థాయి అసంకల్పితంగా పెరిగింది.

"అదేదో బయటికి తియ్యమంటే తియ్యవే!" గర్జించాను.

ఆమె గతుక్కుమంది. నెమ్మదిగా తన కుడి చేతిని ముందుకు తెచ్చింది. చేతిని విప్పి చూపించింది. మెరుస్తున్న సిల్వర్ ఫాయిల్ కాగితంలోకట్టిన పొట్లం విడిపోయి ఎవరో చెల్లెలు వాళ్ళ అన్నకి ఇచ్చిన రాఖీ పండగ కోవా స్వీటు..అతడు సగం తిని వదిలేసినది. కింద పడిపోయి ఉంటే ఈమె ఏరుకొని ఉండవచ్చు.

"పిల్లడి కోసం దాచినానమ్మా!" కన్నీరు ఇంకిపోయిన కళ్ళల్లో భయం ప్రతిఫలిస్తుండగా అన్నదామె. ఆ స్వరంలోని దీనత్వం నాలోని స్త్రీ హృదయాన్ని తాకింది. నా కంటిలో అప్రయత్నంగా కన్నీరుబికింది. తల పక్కకు తిప్పుకోబోయాను. ఉదయపు ఎండ సిల్వర్ ఫాయిల్ పై పడి నా కళ్ళకి మెరుపులా కొట్టింది. గబుక్కున చూపు మరల్చుకున్నాను. "అవును..ఈమెకిదే మిగిలింది. ముష్టి ఆడవాళ్ళకి చీరలూ, డబ్బులూ ఇవ్వడానికి అన్నలుండరు. చుట్టూ ఎంతమంది మగవాళ్ళున్నా అందరూ మొగుళ్లే!" నాలోని స్త్రీ నిట్టూర్చింది. ఆమెని బెదిరిస్తున్నవాళ్ళని అక్కడనుండి వెళ్లిపొమ్మని చెపుదామనుకొన్నాను. ఇంతలో ఒక్క కుదుపుతో ట్రెయిన్ ఆగింది. వైజాగ్ వచ్చేసింది. ఆ ఇద్దరు మగవాళ్ళూ తృప్తి పడలేదు. ఇంకా ఏదో ఉండి ఉంటుంది తియ్యమంటున్నారు. దిగే జనం కొద్దిసేపు ఆగి ఆ గొడవను ఆసక్తిగా చూస్తున్నారు. వాళ్లకేం కంగారు లేదు. ఇది చివరి స్టేషన్ కదా. చూస్తుంటే గొడవ ఇంకొంచెం పెద్దదయ్యేటట్టుగా కనిపిస్తూ ఉంది.

హఠాత్తుగా గుర్తొచ్చింది. మా అన్నయ్య పెట్టిన చీరా, పదివేలూ ఆయనకి చూపించాలి. "అయ్యయ్యో!దిక్కుమాలిన ముష్టిదాని గొడవలో మరచేపోయాను. ఇప్పటికే లేటయ్యింది." అనుకుంటూ బెర్తు పైన వదిలేసిన నా వస్తువులు చూసుకున్నాను. నాకు గౌరవచిహ్నమైన మా అన్నయ్య ఇచ్చిన పదివేలూ, చీరా మిగతా అన్ని వస్తువులూ భద్రంగా ఉన్నాయి. వాటి మీద ఎవరి చూపూ పడలేదు. ముష్టిది ఏమైపోతే నాకేమిటి? దాని పూర్వజన్మ ఖర్మ

అది అనుభవిస్తున్నది. ఆమెవైపైనా చూడకుండా తలవంచుకుని వేగంగా ట్రెయిన్ దిగిపోయాను. స్కూటీ ఎక్కి ఇంటికి వెళ్లిపోతుంటే లోపల్లోపల అనిపించింది. "నేను ట్రైను దిగేటప్పుడు ఎందుకని తలవంచుకున్నాను?"

"పొరపాటున ఆ చిన్నపాపనో ముష్టిదాన్నో తొక్కెయ్యకుండా చూసుకొని దిగాను." మనస్సులోని ఒక గొంతు నేను చేసిన పనిని సమర్థిస్తున్నట్టుగా సమాధానం చెప్పింది.

"కాదు..కాదు..అబద్ధం..ఆమెలాగే ఆడదానిగా పుట్టి ఒంటినిండా బట్టలు కట్టుకొని, కడుపునిండా తింటూ కూడా ఆమెకు మాట సాయమైనా చెయ్యలేనందుకు నీకు సిగ్గేసింది కదా?!!" లోపల్నుంచి ఇంకో గొంతు గట్టిగా, నిలదీస్తున్నట్టుగా ప్రశ్నించింది.

"అదేం లేదు! నాకెందుకు సిగ్గు?" మొదటి గొంతు తడబడింది. "అయినా నాకు అర్జంటు పనుంది. ఇంటికి వెళ్ళి మా ఆయనకు ఇవన్నీ చూపించాలి. అంతే!" తడబాటునుండి తేరుకుని రెండో గొంతును మాట్లాడనివ్వకుండా నొక్కేస్తూ అన్నది. నేను స్కూటీ వేగం పెంచి డ్రైవింగ్ మీదే దృష్టి పెట్టాను. ట్రాఫిక్ హర్డిల్స్ దాటుకొని ఇంటికి చేరేటప్పటికి టైము ఎనిమిదీ ఏభై అయింది." హడావుడిగా స్కూటీ పార్క్ చేసి ఇంట్లోకి అడుగుపెట్టాను. మా వారు అప్పటికే తయారైపోయి సోఫాలో కూర్చుని కాఫీ తాగుతున్నారు.

"వచ్చేశావా? ట్రైన్ చాలా లేట్ అయినట్టుంది"అన్నారు పలకరింపుగా.

"అవును.. చాలా చిరాకు పుట్టింది." అంటూనే బ్యాగులోంచి అన్నయ్య పెట్టిన కొత్త పట్టుచీరను, పదివేల రూపాయల కట్టను గర్వంగా తీసి టేబుల్ మీద పెట్టాను.

ఆయన ఆశ్చర్యంగా ఆ డబ్బును చూస్తూ, "అబ్బో! మీ అన్నయ్య ఈసారి గట్టిగానే ఇచ్చాడే.. రాఖీ పండగ బాగా కలిసొచ్చింది నీకు" అంటూ నవ్వారు. ఆయన ముఖంలో సంతోషం చూసి నేను కూడా నవ్వి ఉండాలి. కానీ నా పెదవులు కదల్లేదు. నా కళ్ళముందు ఆ సిల్వర్ ఫాయిల్ లోని ఎంగిలి స్వీటు ముక్కే కదులుతోంది. టేబుల్ మీద పెట్టిన పదివేల రూపాయల కట్టలో ఆ ముష్టి యువతి భయంతో నిండిన దీనమైన ముఖం ప్రతిఫలించింది.

'ఏమైంది? అలా ఉన్నావేం?' అని ఆయన అడుగుతుంటే.. 'ఏమీ లేదు.. నైట్ డ్యూటీ కదా.. నిద్ర సరిగ్గా లేదు' అని అబద్ధం చెప్పి లోపలికి నడిచాను. నాలోని ఆ రెండవ స్వరం మాత్రం ఇప్పుడు వికటంగా, వంకరగా, పగలబడి నవ్వుతోంది. బాత్రూమ్ లోకి వెళ్ళి మురికిని వదిలించుకోవడానికి స్నానానికి ఉపక్రమించాను.

COMMENTS